# 'శ్రేయోభిలాషులు'

## శ్రీ ఆదివిష్ణు

వారం రోజులనుంచీ డైరీలో కాగితాలు కాళీగా ఉన్నాయి. రాయడానికి వార్తంటూ దొరకడంలేదు జానకిరామయ్యగార్కి. దానికితోడు బద్ధకం ఒకటి జతయ్యింది.

వెనుకపేజీలు తిప్పడం మొదలుపెట్టారు.

'ఈ రోజు అసలేం తోచడంలేదు. పిల్లల ఆరోగ్యం ఎలావుందో ఏమో. బొత్తిగా ఉత్తరాలు రాయడమే మానుకున్నారు. రేపు, నాలుగుచివాట్లు పెడుతూ ఉత్తరాలు రాయాలని ఉంది.'

మరికొన్నిపేజీలవెనక—

'పొద్దుటనుండి జోరునవర్షం. ఇంట్లోంకాలు బయటపెట్టలేదు. అంతా వెలితిగావుంది. ఇంకాఎన్నాళ్లు యీ బ్రతుకు వెలిగించాలో ఏమో !—'

'పెద్దబ్బాయి ఉత్తరం రాశాడు. ప్రమోషన్ ఎక్స్పెక్ట్ చేస్తూన్నాట్ట. వాడిదేం— రాజాలాటి మనిషి. అదృష్టవంతుడు. వాడి భవిష్యత్తుమీద నాకు మంచి నమ్మకంవుంది. పోతే— నా దిగులంతా చిన్నాడిమీదనే.'

'కోడలికి సుస్తీగా వుందని రాశాడు చిన్నాడు. వస్తుతా ఆ పిల్ల అనారోగ్యపిల్ల. సరైనమందులు వాడుతున్నాడో లేదో. అయినావాడు ఆ చోట ఉద్యోగం చెయ్యకపోతే కలిగే నష్టమేమిటో నా కర్థంకావటంలేదు.'

చాలా పేజీలు తిప్పారు. ఏ పేజీలోనూ ప్రత్యేకత కనుపించడంలేదు. బ్రతుకంతా చప్పగా, చేదుగా వున్నట్టుంది. ఎందుకనోమరి—

ఒక్కోసారి జానకిరామయ్యగారి ఆనందానికి అవధులుండవు. జీవితంలో తీపిదనమంతా తనఒక్కడి సొత్తని మురిసిపోతారు. అప్పుడను కుంటారయన—

'మరో పాతికేళ్లు బ్రతికితే ఎంత బావుండును—'
—గోడగడియారం నాలుగుసార్లు మూలిగింది.

కాలానికి కళ్లెంలేదుట. తన పరిచయస్థుల్లో ఎవరో అంటూండేవారు. ఎవరతడు ? ఎవళ్లో, జ్ఞాపకానికి రావడంలేదు. ఎవరైనా— ఆ మాటన్నవాడు యోగ్యుడేను. చాలాబాగా చెప్పాడు. ఇలా ఒక్కోగంటా ఖర్చైపోతే—చివరికి—ఛా.... ఇవ్వాళేమిటీ ఆలోచనలు ? చేతినిండా పనిలేకపోతే యింతేమరి.

తను సర్వీస్‌లో వుండగా ప్రతివాడూ అనేవాడు 'ఆనెస్టు ఆఫీసర'ని. సరిగ్గా వేళకి ఆఫీసుకి వెళ్లేవాడు. బాగా రాత్రిపడిన తర్వాతగాని యింటికి వచ్చేవాడుకాదు. ఆఫీసుపనితప్ప, అప్పట్లో మరో వ్యాపకమంటూ వుండేదికాదు.

బాగా జ్ఞాపకం— ఆఫీసులో సుందరమనే 'స్టెనో' వుండేవాడు. కుర్రాడు. కొత్తగా పెళ్లయింది. త్వరగా యింటికి చేరుకోవాలని వుండేది. కాని— సాక్షాత్తుతను ఫైళ్లు ముందేసుకు కూర్చుంటే, ఆఫీసరునొదిలి ఎలావెళ్లగలడు. వెళ్లాలనివుండి, వెళ్లాలని అడగలేక దిగాలుపడిపోయి పనిచేస్తుండేవాడు. 'ఈపీడ ఎప్పుడు విరగడౌతుందిరా భగవంతుడా ?' అని అతను చాలాసార్లు అనుకునేవుంటాడు. పాపం— ..

మరో విషయం.... చాలామంది గుమాస్తాలు, తోటి ఆఫీసర్లుగూడాను, తనని ఛండశాసనుడని అనుకునేవారు. నిజమేమరి—డ్యూటీ ఫస్టనేజాతివారి ప్రముఖులు, సోమరితనం దూరంగా వుంచుకోమని ప్రతివాడికీ చెప్పేవారు. పనిచెయ్యనివాడి ప్రాణాలు తోటి, మంచిదారిలో పెట్టడానికి సర్వవిధాలా ప్రయత్నించేవారు. అవకతవక వేషాలువేస్తే తగినశిక్ష విధించేవారు. అలాంటప్పుడు తను ఛండశాసనుడు కావడంలో ఆశ్చర్యంలేదు.

కాని తన మనసుని తెలుసుకోడానికి 'ఏ ఫూలా' ప్రయత్నించలేదు.

ఈ తత్త్వం బాగా అలవాటైపోయింది. స్ట్రిక్ట్ ఆఫీసరంటే యమధర్మరాజుకి ఏజంటులాచూస్తుంటారు. ఇన్ని స్కేండల్స్ వాడినెత్తిన రుద్దుతారు.

తన యిన్నేళ్ల సర్వీస్‌లోనూ—ఆ ఒక్క ఎకౌంటెంటే తనకు నచ్చాడు. అవునూ— అతనిప్పుడు ఎక్కడున్నాడు— ఎంతమంది పిల్లలో, ప్రయోజకులైయ్యారో లేదో— పాపం— ఇరవైనాల్గుగంటలూ ఆఫీసుపనిలోనే మునిగిఉండేవాడు. ఒక్కోసారి భోజనానిక్కూడా వెళ్లేవాడుకాదు. అప్పుడు తనకి జాలివేసేది. తను వెళ్లమనిచెప్తేగాని యింటికివెళ్లేవాడుకాదు.

అదీ అలావుండాలి. ఉద్యోగస్థుడైనతర్వాత డ్యూటీకంటె మించింది మరొకటిలేదనేవాడే పైకొస్తాడు. దొంగలెప్పుడూ దొంగలగానే స్థిరపడిపోతారు.

దొంగలంటే గుర్తుకొచ్చింది. విశ్వనాథం తనతోటి ఉద్యోగేగా, ఏమయ్యిందతనికి. అతనిముందు అతన్ని అందరూ పొగిడిపారేసేవాళ్లు. వెనకమాటున బూతులు తిట్టేవారు. విశ్వనాథం వస్తుతా అమాయకుడేమో, వాళ్లమాటలన్నీ నమ్మాడు. నిజంకాబోలని వుబ్బిపోయాడు. వాళ్లంతా వట్టిదొంగలు, చాతకాని వెధవలూ అని తెలుసుకోలేకపోయాడు. ఫలితం అనుభవించాడు.

అందుకనే 'పనిదొంగల్ని' ఎప్పుడూ నమ్మకూడదు. మాటలు చెప్పుకు బ్రతికేవాళ్ళకి వాత పెడుతూనేవుండాలి. అప్పటిగ్గాని బుద్ధిరాదు వెధవలకి.

అయినా యిప్పుడీ విషయాలన్నీ ఎందుకసలు ?

గతించింది గుర్తు చేసుకుంటూంటే చాలా బాధగానూ, హాయిగానూ, చేదుగానూ, తీపిగానూ .... .... ....

"ఇదిగో విన్నే! కాస్త కాఫీతగలెద్దూ. తలనొప్పితో చస్తున్నాను."

ఈ యింటావిడ వట్టిబద్ధకంమనిషి. అవతల మగాడికి ఎప్పుడు ఏదికావలసి వుంటుందోనన్న జ్ఞానంకూడాలేదు. ఏదైనా, చెప్తేనేగాని, అదీకాస్త ఆలస్యంగాగాని, చెయ్యడం చాతకాదు. అబ్బబ్బ.... యిలాంటి మనిషితో యిన్నేళ్లకాపురం ఎలా....

"విన్నే.... చెవిటిమాలోకం.... పిలిస్తే పలకవుగదా.... కాఫీ...."

"ఇదిగో తాతయ్యా !" సుగుణ కాఫీతెచ్చింది.

"నువ్వు బళ్ళోకి వెళ్లలేదుటే సుగుణా...."

"లేదు తాతయ్యా...."

"ఎందుకనిట ?"

"నేనే వుండిపొమ్మని చెప్పాను. ఈ లంకంత యింట్లో ఒక్కదాన్నీ వుండలేక, ఎదో పసిపిల్లతో కబుర్లైనా చెప్పుకుందామని నేనే వెళ్ళొద్దన్నాను." అన్నారావిడ.

"చాల్లే నిర్వాహకం. సంతోషించాలి. ఇందుకోసమేనా అది తల్లీతండ్రుల్ని వదిలి యింతదూరం వచ్చింది ?"

"మీది మరీ విడ్డూరం !"

"లేకపోతే ఏవిటిది ? నాలుగుముక్కలు వంటపడతాయి గదానివాడు దీన్నిక్కడికి పంపిస్తే, చదువుకి ఎగనామంపెట్టమని నువ్వూ సలహాలిస్తావు ? చిన్నపిల్లలకి చెప్పే బుద్ధులివేనా ?" జానకి రామయ్యగారు విసుక్కున్నారు.

"పోనిద్దురూ— ఇది యిప్పట్నుంచే చదివి ఏమి ఉద్ధరించాలి గనుక ? ఏడేళ్లయినా నిండలేదాయె."

"ఆ.... నువ్వు చెప్పటానికేమిలే మహబాగాచెప్తావు. నీ ఆలుసు తీసుకునేగా చిన్నాడు యిప్పుడు ఎందుకు పనికిరాని గుమాస్తాగిరికి వోచుకున్నాడు. సుగుణమ్మతల్లీ ! దాని మాటలు విని చదువుమానుకోకేం ? రోజూ బడికివెళ్లాలి. పాఠాలు నేర్చుకోవాలి. మీ నాన్న నిన్నుచూసి మురిసిపోవాలి. తెలిసిందా ?"

"మరినువ్వో తాతయ్యా—"

"నా తల్లిగాదె.... నా మాటమరిచిపోతున్నానా కన్నతల్లి.. చూడవేచూడు.... నా తల్లికి నేనంటే ఎంత ప్రాణమో." సుగుణ తలని లాలనగా నిమురుతూ భార్యవైపు గర్వంగా చూశారాయన.

—బడికి వెళ్లలేదని సుగుణని మందలించడంమాని, ఆ పిల్లతో కబుర్లాడటం మొదలుపెట్టారు జానకి రామయ్య. ఇదిచూస్తూ నిలబడ్డ యింటావిడ వచ్చేనవ్వుని ఆపుకుంటూ అన్నారు—

"అవతల కాఫీ చల్లారిపోతుంది. ముందుకాఫీతాగి ఆనక మనవరాలితో ముచ్చట్లాడండి."

"అవునవును. కాఫీతెచ్చావుగదూ.... మరినువ్వు తాగావా చిట్టీ !" అని మనవరాలిని అడిగారు.

"ఓ....నాన్నమ్మ నా కెప్పుడో యిచ్చింది."

చిన్నపిల్లలు కాఫీ తాగరాదనే ఆరోగ్యసూత్రం అప్పటిగ్గాని ఆయనకు గుర్తురాలేదు.

"నీకు నానమ్మ కాఫీయిచ్చిందా.... ఇదిగో వింటున్నావా? పసిపిల్లకి కాఫీ యిస్తావూ.... నీకేమైనా మతివుందా? అసలు చూస్తూవుంటె నువ్వు పిల్లల్ని చెరపడానికే వుద్ధరించినట్టు కనుపిస్తున్నావే ? నీకు బుద్ధిఅనేది వుందా ? అలారాయిలా నిలబడకపోతే సమాధానంచెప్పరాదూ."

"కాఫీ యిచ్చినంత మాత్రాన—"

"ఇంకఆపట్టె మాటడకు. కాఫీయిస్తుందట కాఫీ.... ముచ్చటయితే—మొన్నహార్లిక్సు తీసుకొచ్చాను. అది యివ్వగూడదూ.... మనిషికి ఒకసారిచెప్తే అర్థంచేసుకునే జ్ఞానం వుండాలి.... ఇదిగోచిట్టీ ! నువ్వెప్పుడూ కాఫీతాగకు. అది నీ ఆరోగ్యాన్ని పాడుచేస్తుందమ్మా !"

"నువ్వూ తాగుతున్నావుగా తాతయ్యా.... మరి నీ ఆరోగ్యం పాడవుదూ...."

తాతయ్య తత్తరపాటు చెందారు. నానమ్మ నవ్వారు. ఆవిడ నవ్వుచూస్తుంటే ఆయనకు తలకొట్టినంత పనయింది. 'ఆసి భడవా !' అని లోలోన అనుకుని, తనని సమర్థించుకుంటూ ఓ కుంటి సమాధానం చెప్పారు.

"మేము, పెద్దాళ్లంగదూ.... కాఫీ తాగుతే మా ఆరోగ్యం పాడవదు. నువ్వు చిన్నపిల్లవి కాబట్టి నువ్వుతాగుతే ఆరోగ్యం పాడవుతుంది."

"అచ్చం తండ్రిపోలికలు. పెద్దాడుమాత్రం యింతే గదుటండీ !"

"అవునేవ్.... ఇలాంటి చిక్కుప్రశ్నలడగటంలో వాడు గజమొండి. ప్రతిచిన్నవిషయాన్నీ అంతశ్రద్ధ చూపించి అడిగేవాడుకాబట్టే వాడిప్పుడు యింతహోదాలో వున్నాడు." పెద్దకొడుకు గుర్తుకురాగానే చాలావిషయాలు కదిలాయి....

"నీకు గుర్తుందో లేదోగాని, వెధవాయి నన్ను వోక్షణమైనా విడిచిపెట్టి వుండేవాడుకాదు. పైగా— ఆఫీసునుంచి యింటికిరాగానే వాడితోనాకు చక్కటి కాలక్షేపం గూడాను.— ఏం ఉద్యోగాలో ఏమో.... విసరిపారేసినట్టు మనకిదూరంగా అడవిలో వుంటున్నాడు. చూశావ్ ఉద్యోగాల్లోవున్న గమ్మత్తే యింత. సెంట్రల్ ఎక్సైజ్ సూపర్నెంటైనంతమాత్రం, తల్లి

దండ్రుల దగ్గరుండాలని ఎక్కడుంది. ఉద్యోగధర్మానికి యీ అనుబంధాలు అడ్డురాకూడదు. అన్నీ మరిచిపోవాలి. అందర్నీ వదులుకోవాలి.... అయినా మనసిచ్చిగానీ, వాడికేంతక్కువ ? మంచి హోదా, చేతినిండా డబ్బు, ప్రాణంలాంటి భార్య, రత్నాల్లాంటి పిల్లలు.... అవునూ.... శేషు యింకా యింటికి రాలేదేమిటి ?"

చిరంజీవి శేషువిషయం గుర్తుకురాగానే— పొద్దున్నుంచి జ్ఞాపకానికి రాకుండా దూరంగా తిరుగుతున్న ఓ అతి ప్రమాదమైన సంగతి, దానంతటదే గుర్తుకొచ్చింది.

"వాడు.... వాడేం చేశాడోతెలుసా ? ప్రేలెడుతాడు వెధవాల్....."

"ఏం చేశాడండి."

ఆయన చివాలునలేచి నిలబడ్డారు. 'అది' తలుచుకుంటూంటె కోపంవస్తోందిమరి.

"ఏం చేశాడా ?.... చేస్తాడు. వాడిష్టంవచ్చింది భయం భక్తీ లేకుండాచేస్తాడు. ఇదంతా నీ భరోసా చూచుకునే చేస్తున్నాడు. నీ గారాబంవల్లనేవాడు భ్రష్టుడవటానికి సిద్ధపడుతున్నాడు. ఈ సంగతి వాళ్లనాన్నకి తెలుస్తే యింకేమైనావుందా? 'తాతవై వుండి వాడు చెడిపోతుంటె చూస్తూ వూరుకుంటావా. నాన్నా !' అని నాముఖంముందె నాలుగూ కడిగేస్తాడు."

"ఇంతకీ ఏంచేశాడో చెప్పరేం ఖర్మం !"

"మరిటా— వాడు నీముద్దుల మనవడు, పెద్దాడి కొడుకు.... వుండు.... వాడొచ్చేవేళయిందిగా వాడినోటితోనే చెప్పిస్తాను. చదువుకుని బాగుపడరాబాబూ అనిచెప్పి వాడిని కాలేజీకి పంపుతే వాడుచేసేపని యిదా ?"

"ఎందుకలా వాడిమీద మండిపడిపోతారు. అసలే కుర్రకుంక. నిండా పదిహేనేళ్లయ్యి—"

"వప్పుకుంటావ్ గదా.... ఆ కుర్రకుంకటా, సాక్షాత్తు వాడి మాష్టరుముందె సిగరెట్టు కాల్చిపారేశాట్ట."

"ఆఁ......"

"మరేవిటనుకున్నావ్. ఇవ్వాళ సిగరెట్టు కాల్చాడు. రేపేమో రేవు.... నాకీ సంగతి ఉదయమే గుర్తుకొచ్చివుంటే అప్పుడే వాడి చర్మం వల్చేసివుందును. ఏమిటనుకుంటున్నాడో ఏవిటో. తాతయ్యేగదా.... ఆ ఫూల్ నన్ను నెత్తిమీద పెట్టుకుంటాడు గదాఅని ధీమా ? చూపిస్తానా తడాఖా !"

"చాల్లెద్దురూ.... పసివాడు ఎదోతెలీక...."

"అవునే .... పసివాడు. ఇలా అనే చిన్నవాడిని చెడిపేశావ్. వెధవ, గుమాస్తాగిరిలో సతమత మవుతున్నాడు."

"మాటకిముందు చిన్నాడిమీద అలా నోరు చేసుకుంటారెందుకసలు ? వాడికేం ? పదిమందిలోనూ 'భేష్' అనిపించుకుంటున్నాడు. మొన్న వాడు రాసిన కథకి ప్రైజ్ కూడా వచ్చిందని—"

"విన్నాం. విని ఏం చెయ్యమంటావ్ ? ఎగిరి గంతులెయ్యమంటావా ? సిగ్గులేదూ. వాడిని వెనకేసుకు వస్తున్నావ్. పెద్దాడికీ, చిన్నాడికీ భేదం తెలీడంలేదు నీకు? వాడేమో నూపరింటెండెంటా ? వీడు కానికి పనికిరాని గుమాస్తానా ? ఎవడ్ని చూసి సంతోషించమంటావ్ ?"

"ఎవరదృష్టం కొద్దీ వాళ్లు పైకొస్తారు."

"గాడిద గుడ్డేం కాదూ. అదృష్టమట. అదృష్టం! వల్లకాడు ! కృషే, కృషి. కృషి కావాలి. అంతేగాని జులాయి వెధవలా తల్లిదండ్రుల్ని ఎదిరించి తిరిగేవాడు బాగుపడతాడనుకున్నావా ?—ఇప్పుడు కాదు, రేపు నలుగురు పిల్లలు పుట్టిన తర్వాత తెలుస్తుంది వాడి అవస్థ. పెద్దాడి సంగతంటావ్—దేవుడు కనికరించి యిప్పటికి ఇద్దర్ని ప్రసాదించాడు. పదిమంది కలిగినా, వాళ్లందరికీ రాజభోగాలు అమర్చగలడు."

"దేవుడి దయవల్ల ఇప్పుడు మనకున్నదే చాలు. నిశ్చింతగా నాలుగు తరాలు గడవటానికి. చిన్నాడు మాత్రం యిబ్బంది పడాలని ఎక్కడుంది ? వాడి వాటా వాడి కిచ్చేస్తిమా, వాడూ అనుభవించగలడు అన్ని భోగాలూను."

"అంటే నీ ఉద్దేశ్యం ? ఇప్పుడు ఆస్థి పంపకం జరగాలంటావా ? అది నా బొందిలో ప్రాణం ఉండగా జరగదు."

"మన అబ్బాయిలకీ అభిమానం ఉంది."

"అందుకని ఇప్పుడేమంటావ్ ?"

ఆవిడ ఏమీ అనలేదు. నుగుణను తీసుకుని వంట గదిలోకి వెళ్లింది.

ఇలాంటి గలాటాలు ఆ యింటో గత ఏడెనిమిది సంవత్సరాలనుండీ అలవాటేను. వాటికో కారణమంటూ ఉండక్కర్లేదు. ఆమాత్రం లేకపోతే—యీ చివరి రోజులు ఏం సందడిగా గడుస్తాయి ? అదీ గమనించాలి మరి.

జానకిరామయ్యగారు శేషు విషయం పూర్తిగా మరిచిపోయారు. చిన్నవాడి గురించి ఆలోచించడం మొదలుపెట్టారు. లేచి నిలబడినవారు మళ్లీ పడక కుర్చీలో నడుం వాల్చారు.

పక్కనున్న కాఫీ పూర్తిగా చల్లారిపోయి పది నిముషాలయ్యింది.

—సరిగ్గా అయిదు గంటలకి గుమ్మం బయట సైకిలు బెల్లు వినిపించింది. బెల్లు వినిపించగానే భార్య నుద్దేశించి అన్నారు గట్టిగా—

"శేషు వచ్చేడేవ్ ...."

శేషు లోపలికి వస్తూనే అన్నాడు,

"తాతయ్యా, ఇవ్వాళ నీకో గుడ్‌న్యూస్ చెప్తాను చెప్పనా ?"

"ఏమిటో అది ?"

"చెప్తే ఏమిస్తావ్ ?"

"చెప్పరా భడవా! చెప్పిన తర్వాత నీ ప్రెజంటేషన్ ఆలోచిస్తాను."

వీడు మరీను. పెద్దాడి మల్లే ప్రతి విషయానికీ 'సస్పెన్స్' తగిలిస్తాడు. ఆ సమయానికి ఇంటావిడ గూడా అక్కడికి వచ్చారు.

"శంకరం బాబాయ్ ఉత్తరం రాశాడు."

"వూ .... రాస్తే—"

"అందరూ వినండహో .... అతి త్వరలో నాకూ, చి. సౌ. చెల్లాయి సుగుణకీ—ఒక చక్కటి తమ్ముడు పుట్ట బోతున్నాడు."

ఆ వార్త వినగానే మనవడ్ని కావులించుకుంది ఇంటావిడ. వాడి తలని నిమురుతూ అన్నారు—

"నా బాబే .... ఎంత మంచి వార్త చెప్పావురా నాయనా"

"వరేయ్ .... వరేయ్ .... ఆ ఉత్తరాన్ని ఇలా .... ఇవ్వరా" కుర్చీలోంచి ఒక్కసారిగా లేచి నిలబడి తడబడుతూ, ఆ ఉత్తరాన్ని అడిగారు జానకిరామయ్య—కళ్లజోడు సర్దుకుంటూనే శేషు యిచ్చిన ఉత్తరాన్ని పూర్తిగా చదివారు. ఇంటావిడ కోరిక మీద బిగ్గరగా చదవాలసి వచ్చింది.—

'చిరంజీవి శేషుని, మీ బాబాయి ఆశీర్వదించి వ్రాయునది. మీ పిన్నికి వారం రోజులనుండి వంట్లో బావుండుట లేదని, మొన్న హాస్పిటల్‌కు తీసుకువెళ్లాను. అక్కడ డాక్టర్లు మీ పిన్నిని పరీక్షించారు. త్వరలో నీకూ, నీ చెల్లాయికీ ఒక చక్కటి తమ్ముడు పుట్టబోతున్నాడని చెప్పారు. అన్న కూడా యివ్వేళనే ఉత్తరం రాస్తున్నాను. ఈ విషయం తాతకీ, నాన్నమ్మకీ నువ్వే చెప్పు. కానీ—ఒక షరతు— వాళ్లు నీకేదైనా ప్రెజెంట్ యిచ్చేంతవరకూ ఈ విషయం చెప్పకు. తాతయ్యకీ, నాన్నమ్మకీ నా వందనా లందజేయి. చెల్లాయికి నా ముద్దులని చెప్పు. బాగా చదువుతున్నా వనుకుంటాను. ఉత్తరాలు రాస్తూండు.'

ఉత్తరం చదివి, దాన్ని జేబులో పెట్టుకుని శేషుతో అన్నారు.

"నీ కొక్కడికే ఉత్తరం రాయడంలో వాడి ఉద్దేశ్య మేమిటో ?"

"మా బాబాయి సంగతి మీ కెవరికీ తెలీ దసలు. మన మంటే ప్రాణం. ప్రతీ సంగతీ ముందుగా మనకు తెలియా ల్సిందే."

"సంతోషించాలే .... ఎలాగైతేనేం మంచి బాబాయి నీ కొక్కడికే దొరికాడు. ఆ .... ఇదిగో ముందు ఆ విషయం ఆలోచించు."

ఆ విషయ మేదో తనకి గుర్తు రావడానికి ఓ క్షణం పట్టింది. ఆ క్షణం తర్వాత అన్నారు భార్యతో.

"అసలే ఆ పిల్లకి అనారోగ్యం. వాళ్ల పుట్టింటి మాటంటావా ? పట్టి పల్లెటూరి మాలోకం. అందుచేత ఆ అమ్మాయిని మనింటికే తీసుకొద్దాం. ఇక్కడ మంచి డాక్టర్లున్నారు. ఈ విషయమే రేపు వాడికి రాస్తాను. ఏమిటో, దేవుడి కిన్నాళ్లకి వాడిమీద దయ కలిగింది. ఓ నలుసు నిస్తున్నాడు. అదే చాలు. ఇదిగో నే చెప్పే దేమైనా వినిపించు కుంటున్నావా ?"

"నన్నలా విసిగించకపోతే, మీరు చెప్పేదేదో చెప్పరా దుటండీ! నేనూ వాడి విషయమే ఆలోచిస్తున్నాను."

"అదే .... ఆ పిల్ల నిక్కడికి తెస్తామనుకో. అంత వరకూ బాగానే ఉంది. కాని—వాడు హోటల్లో చెయ్యి కడుక్కోవలసి వస్తుందిగదా. పైగా—యీ హోటలు భోజనం వాడి శరీర తత్వానికి సుతరామూ పడదాయె ఖర్మ."

"సెలవు పెట్టి వాడిని గూడా యిక్కడికి వచ్చేయ మనండి."

ఆయన ఫక్కున నవ్వారు.

"నీ కేమైనా మతి పోయిందా ఏమిటే? ఎన్నాళ్లని సెలవిస్తారు. అదేమైనా ఆఫీసనుకున్నావా లేక ధర్మసత్ర మనుకున్నావా, అడిగినన్ని సెలవు లివ్వటానికి." ఆయనకు తన ఆఫీసరుగిరీ గుర్తు కొచ్చింది. అంతలోనే కొడుకు దుస్థితి (గుమాస్తా గిరీ) మీద జాలివేసింది.

"అసలా బోడి గుమాస్తా గిరికి రాజీనామా యివ్వ మని రాస్తాను. వాళ్లిచ్చే నూటేభై నేనే యిస్తాను. వాడు ఇంటిపట్టున మన కళ్లముందుంటే అంతే చాలు. పిచ్చి వెధవ— ఎంత బాధపడుతున్నాడో ఏమో."

"అలాగే చెయ్యమనండి. పెద్దతనంలో ఉన్నామా— పాడు మనసు పిల్లల మీదికి పోతోంది."

"నువ్వూ వప్పుకున్నావ్ కదూ—కాని .... వాడితో వచ్చిన చిక్కేమిటంటే, నామాట వినిపించుకోడు. పైగా ఉద్యోగం పురుషలక్షణ మంటారు. ఒకపని చేస్తా, వచ్చే సంక్రాంతికి నువ్వూ, నీ భార్యా యిక్కడికి రావలసిందని రాస్తాను. వాడు వచ్చిన తర్వాత ఏదో విధాన వాడిని వప్పించి రాజీనామా యిప్పిద్దాం. సరేనా—" అంటూ ఆయన అప్పటికే ఇంటిగుమ్మం దాటారు.

"తాతోయ్, నా ప్రెజంటేషన్ మాటేం జేశావ్" అన్నాడు చిరంజీవి శేషు.

"మీ మామ్మ దగ్గర ఓ పది రూపాయలు పుచ్చుకో ... మంచి పెన్ను లేదని గోల పెడుతున్నావ్‌గా" అని చెప్పి గబ గబా నడుచుకుంటూ వెళ్లిపోయారు.

"ఏమిటో చిత్రమైన మనిషి. క్షణానికో విధంగా మారి పోతూంటారు." అనుకుంది ఇంటావిడ.

*　　*　　*

రోడ్డుమీదికి వచ్చిన తర్వాత శేషు సిగరెట్టు కాల్చి నట్టు మళ్లీ జ్ఞాపకానికి వచ్చింది జానకిరామయ్యగారికి. నవ్వు కున్నారు.

ఇప్పుడు, తనకు మనవడు పుట్టబోతున్నాడనే శుభ వార్త ముఖ్యంగా సుబ్బరాజుకి చెప్పాలి. కనిపించినప్పుడల్లా అడుగుతాడు. 'మీ రెండోవాడికి పిల్లలా ?' అని. ఇప్పుడు గర్వంగా చెప్పాలి. ఉత్తరాన్ని అతని ముఖంమీద గిరాటు వెయ్యాలి.

సుబ్బరాజు తన శ్రేయస్సుని కోరే మనుషుల్లో ఒకడు. అత నంటాడు— "నీ కేమిటోయ్— రామలక్ష్మణుల్లాంటి యిద్దరు కొడుకులు. ఇప్పటికీ నీ మాట జవదాటరు. రత్నా ల్లాంటి మనవలు, తరగని ఆస్థి. మనిషికి ఇంతకంటె కావలసిం దేమిటోయ్.'

నిజమే. మనిషికి యీ ఆనందం కంటె విలువైనది ఏముంది ?

లోకంలో ఎంతమంది పిల్లలు లేరు. అనుక్షణమూ, అన్నమీద తమ్ముడు—తమ్ముడి మీద అన్న కత్తులు నూరుకో డమే నాయె. అలాంటిది తన పిల్లలు ఎంత అన్యోన్యంగా ఉంటారని. ఇప్పటిగ్గాడా అన్నయ్యంటే చిన్నాడికి ఎంతో భక్తి, విశ్వాసమూను. వాడికి అన్నయ్యమీదున్న గౌరవం నాన్న మీద లేదు. లేదంటే పూర్తిగా లేదని కాదు. గాని, అప్పు డప్పుడూ తన మాట కెదురు చెప్పడం కద్దు—

అందునా, పెద్దవాడి తర్వాత వరుసగా ముగ్గురాడ పిల్లలు పుట్టి పోయిన తర్వాత చిన్నాడు పుట్టాడేమో—— వాడిమీద 'గారాం' చూపించారు. కొద్దో గొప్పో 'అలుసుతనం' నేర్పారు. అందుచేతనే వాడు యిలా తయారయ్యింది.

వాడు శ్రద్ధగా చదివి ఉంటే ఈపరికి మంచి హోదాలో ఉండేవాడు.

నాటకాలూ, కథలూ మీద ఉన్న 'గురి' చదువుమీద ఉండేది కాదు. ఎంత చెప్పినా వినిపించుకునేవాడు కాదు. చదువు కునేవాడు వీటికి దూరంగా ఉండాలని ఎన్నో నీతులు చెప్పినా, వినిపించుకున్నట్టే నటించి తనకు తెలియకుండానే స్టేజి ఎక్క డమో, కథలు రాయడమో చేస్తుండేవాడు. ఒకనాడు ఏమయ్యిందని—

ఏదో ఫంక్షనికి తనకి ఆహ్వానం వస్తే వెళ్లారు. ఫంక్షను ముగిసిన తర్వాత నాటక మన్నారు. తెర ఎత్తేసరికి స్టేజిమీద శంకరం ప్రత్యక్ష మయ్యాడు. ఆ వేషంలో వాడెంత అందంగా ఉన్నాడని. నిజానికి ఆరోజు వాడు చాలా బాగా నటించాడు. ఎంతోమంది వాడిని ప్రశంసించారు. వస్తుతా వాడు చక్కటి నటుడాయె మరి.

గమ్మత్తేమిటంటే వాడితోపాటు తనని గూడా చాలా మంది అభినందించారు. తనకు బలే సిగ్గనిపించింది గూడాను. ఆమాటకొస్తే తన సర్వీసులో గూడా యింతటి 'ప్రశంస' తనకి ఎదురు కాలేదు !

ఆ కాసేపూ తనూ కొంత ఆనందించారు కాని—'నాట కాల్లో దిగిపోతే వాడు చెడిపోతాడేమో' నన్న దిగులు ఓమూల మెదులుతూనే ఉంది.

కథలు రాయడంలో గూడా వాడు మంచిపేరు సంపా దించుకున్నాడు. అయితేనేం—తను అనుకున్నట్టే చివరికి వాడు బి. ఏ. తప్పడం, చదువుకి స్వస్తి పలకడమూ జరిగాయి.

ఏమైనా—పెద్దవాడి ముందు వీడు భ్రష్టుడేను !

—సుబ్బరాజు యింటికి వెళ్లేసరికి బాగా చీకటి పడింది. గేటు తలుపు తెరుచుకుని యింటి ఆవరణలోకి అడుగు పెట్టారు. సుబ్బరాజు కోడలు కాబోలు తనని చూస్తూ అన్నది.

"మావయ్య వూరు వెళ్లారండీ."

మనసు చివుక్కుమన్నది. తిరిగొచ్చేస్తూ అనుకున్నారు.

"శుభవార్త తెలియజేద్దామని వస్తే వీడు లేకపోయె. మళ్లీ ఎప్పుడు వస్తాడో ఏమో ....."

—ఇంటికి చేరుకున్నారు. భోజనాలు అయ్యాయి కాబోలు, శేషు తన గదిలో కూర్చుని బుద్ధిగా చదువుకుంటు న్నాడు. 'వ్వాటీజ్ దిస్ లైఫ్ యిఫ్ ఫుల్లాఫ్ కేర్.'

జానకిరామయ్యగారు భోజనం ముగించి డైరీ రాసు కున్నారు. కాసేపు పడక కుర్చీలో నడుం వాల్చి 'చుట్ట' కాల్చుకున్నారు.

'శేషు సిగరెట్టు కాల్చాడు'—మళ్లీ శేషు చేసిన తప్పు గుర్తుకు వచ్చింది—కాని ఇప్పుడు వాడి చదువు పాడుచేయడ మెందుకని మౌనం వహించారు. ఏదో పుస్తకం తీసి చదువు కోడం ప్రారంభించారు.

గోడ గడియారం తొమ్మిది కొట్టింది.

'వ్వాటీజ్ దిస్ లైఫ్....యిఫ్....ఫుల్....ఆఫ్ .... కేర్.'

శేషుకి నిద్ర వస్తోంది కాబోలు. పరీక్షలు ఎప్పుడో గదా—ఇప్పట్నుంచే ఇంత కష్టపడి చదవకపోతేనేం. ఇలా నిద్ర మేలుకుని చదువుతే ఆరోగ్యం పాడవదూ.

ఈ పి. యు. సి. లో క్లాసు రాగానే ఏ ఇంజనీరింగ్‌కో పంపాలి. అంతేగాని బి. ఏ. లు, బి. కాంలూతో పనిలేదు. ఆ డిగ్రీ లకి ఈ రోజుల్లో బొత్తిగా విలువ లేదు.

శేషు గదిలోంచి ఏ శబ్దమూ రాకపోయేసరికి వాడు నిద్రపోతున్నాడేమోననిపించింది. జానకిరామయ్యగారు శేషు గదిలోకి వెళ్లారు.

చదువుతూన్న పుస్తకాన్ని గుండెలమీద పెట్టుకుని నిద్ర పోతున్నాడు శేషు.

జానకిరామయ్య గారికి ఆ 'పిచ్చి వెధవ' మీద జాలి వేసింది.

శేషు గుండెలమీద నుండి జాగ్రత్తగా పుస్తకాన్ని తీసి టేబిల్‌మీద పెట్టారు. దుప్పటి కప్పుతుండగా శేషు వళ్లు వెచ్చగా తగిలింది. జానకిరామయ్యగారు ఉలిక్కిపడ్డారు.

వయస్సుకి మించిన శరీర సౌష్టవం ఎవళ్లనైనా ఆకర్షిస్తుంది. శేషుమీద ఎవరి దృష్టయినా తగిలిందో ఏం పాడో! అస లిలాంటి విషయాలన్నీ ఇంటావిడ చూచుకోవాలి. ఛ .... వట్టి బద్ధకం మనుషులు.

చిన్నాడు గూడా తన పద్దెనిమిదో ఏటనే, ఓ పాతికేళ్ల యువకుడిలా కనుపించేవాడు. వాడి పోలికే అబ్బింది శేషుకి.

శేషుకి దుప్పటి కప్పి లైట్ ఆఫ్‌జేయ బోతుండగా వాడు ఉలిక్కిపడి లేచాడు. తన గుండెలమీద ఉండాల్సిన పుస్తకం లేదు. ఎదుట తాతయ్య నిలబడి ఉన్నాడు.

"పుస్తకం—"

"నిద్రపోవోయ్ .... అస్తమానం చదువేనా ?"

"ఎల్లుండి మా క్లాసు ఎగ్జామినేషన్ తాతయ్యా."

"అవుతే—దానికోసం రాత్రంతా చదువుతావా ఏమిటి? పడుకో ముందు."

* * *

"మొన్న ఎగ్జామినేషన్లో ఫస్టు మార్కు నాకే వచ్చింది. ఇప్పుడు గూడా రావాలంటే—"

"పోరా భడవా ? ఆరోగ్యం కంటె చదువేం గొప్పది కాదులే. నిద్రపో .... నీలాటి బ్రిల్లియంట్ స్టూడెంట్ చదవక పోయినా ఫస్టు మార్కే తెచ్చుకుంటాడు."

తనమీద తాతయ్యకు గల నమ్మకానికి చిరంజీవి శేషు మురిసిపోయాడు. వాడి కళ్లు ఆనందంతో మెరిసిపోయాయి.

"మీ ఫాదర్‌గ్గూడా ఎప్పుడూ ఫస్టు మార్కులే వచ్చే విరా శేషు! ఒక్కనాడు గూడా వాడి చదువు విషయం అడిగే వాడిని కాదు. స్వయంగా శ్రద్ధ తీసుకుని వాడే చదువుకునే వాడు. చదువుమీద వాడికంత గౌరవం ఉంది కాబట్టే ప్రయో జకు డయ్యాడు. ఆ గౌరవం లేదు కాబట్టే మీ బాబాయి అలా తయారయ్యాడు."

"మాటకి ముందు బాబాయిని అంటావ్‌గాని, బాబాయి కెంత పేరుందో నీకు తెలీదు తాతయ్యా. మా ఇంగ్లీషు లెక్చరర్ బాబాయిని తలవని రోజు లేదు. ఆయన గూడా కథలు రాస్తాడులే. బాబాయికి ప్రైజ్ వచ్చిందని తెలిసి ప్రతి వాళ్లూ బాబాయి వివరాలు నన్ను అడగటమే. చెప్పలేక చస్తూన్నా ననుకో. ఇప్పుడు బాబాయి పేరు ఆంధ్రదేశ మంతటా తెలుసు!"

తాతయ్య మీసాల చాటున నవ్వుకున్నారు! శేషు ప్రక్కన కూర్చుని వాడి భుజం తట్టుతూ అన్నారు.

"బాబాయి మీద నీకెంత ప్రేమరా ? వాడిని ఒక్క మాట గూడా అననివ్వవుగదా! నువ్వు పెద్దాడివై మీ నాన్నంత ఉద్యోగం చేస్తావనుకో .... అప్పుడు గూడా బాబాయిమీద యింత ప్రేమ చూపిస్తావా ?"

"పో .... తాతా" శేషు సిగ్గు పడిపోయాడు.

"నీకు పెళ్లయి, పెళ్లామొచ్చి పిల్లలు పుట్టినా బాబా యిని మరచిపోకూడదు. బాబాయి, పిన్నీ, మీ నాన్నా, అమ్మా, నీ తమ్ముళ్లూ, చెల్లాయిలూ వీళ్లందరి క్షేమాన్ని తెలుసు కుంటూ ఉండాలి. అందరూ సుఖంగా బ్రతకాలి" జానకి రామయ్యగారి కళ్లల్లో నీళ్లు తిరిగాయి—

"మీ అందర్నీ చూసే భాగ్యం—" ఆయన అక్కడ ఆగిపోయి, కళ్లు తుడుచుకుని మళ్లీ అన్నారు.

"మీ బామ్మ నాతో చాలాసార్లు అందిరా శేషు. మాకు దేవుడు వందేళ్ల ఆయుస్సు ప్రసాదిస్తే—మిమ్మల్నందర్నీ చూస్తూ—ఇది నీకు నవ్వుగా ఉంటుందనుకో— మీ పిల్లల్ని పెంచుతూ హాయిగా కృష్ణా, రామా అనుకోవాలని దాని కోరిక. వట్టి పిచ్చిబాగుల మనిషి. దీంతో ఇన్నేళ్లు ఎలా కాపురం చేశానా అని ఆశ్చర్యంగా ఉంటుంది."

"నాన్నా, బాబాయివాళ్లు సంక్రాంతికి తప్పకుండా వస్తారా తాతయ్యా!"

"రమ్మని రేపే ఉత్తరాలు రాస్తాను. రాకపోతే మీ బాబాయి, మీ నాన్న—ఇద్దరి చర్మాలూ వలిచేస్తానని రాస్తాను. సరేనా—అయ్య బాబోయ్ అప్పుడే తొమ్మిదిన్న రవ్వొస్తోంది. చిన్నవాళ్లు ఎక్కువసేపు మేలుకోగూడదు."

శేషుని పడుకోబెట్టి, లైట్ ఆఫ్‌జేసి తన గదిలోకి వెళ్లారు జానకిరామయ్య. పక్కమీద పడుం వాల్చిన తర్వాత మళ్లీ గుర్తుకు వచ్చింది శేషు సిగరెట్టు కాల్చాడని. 'భడవ! తప్పించుకు పోతున్నాడు.' తనలో తను అనుకున్నాడు. ఇంటావిడ మందుసీసాతో లోపలి కొచ్చింది. ఆవిడను చూడగానే అడిగాడు —"నువ్వింకా నిద్రపోలేదా ?"

"సుగుణతల్లి. నన్ను నిద్రపోనిస్తేకదా. కథలు చెప్ప మని నా ప్రాణాలు లోడేసింది పిచ్చితల్లి. ఒక పట్టాన నిద్ర పోదండి. వట్టి మంకు ....."

"మరి .. అచ్చం నీ పోలికే సుమా." ఆయన గబగబా నవ్వేశారు.

ఆవిడ సిగ్గుపడి పోయింది.

"ముందు ఈ మందు తాగండి. తర్వాత నవ్వుకుందురు గాని."

ఆవిడ యిచ్చిన మందు తాగారు.

"ఏమిటో యాంత్రికంగా జీవితం గడుస్తోంది." అన్నారు.

ఆవిడ ఆయన పాదాల దగ్గర కూర్చుంది.

"ఒక్కోసారి యిదంతా వట్టి మాయా ప్రపంచమనీ, మరోసారి ఇదంతా నిజమనీ అనిపిస్తుంది. బాధ్యతలూ, త్యాగాలూ చాలా రుచి చూశాం. నువ్వు గమనించావో లేదో గాని మన పెళ్లయిన కొత్త రోజులకీ ఈనాటికీ చాలా భేదం కనుపిస్తోంది. అప్పట్లో నువ్వు నాకోసం, నేను నీ కోసం అన్నట్టు ఉండేవాళ్లం. ఇప్పుడా భావం దూరమయ్యింది. మనిద్దరం కలిసి మరికొందరి శ్రేయస్సు కోసరం బ్రతుకు తున్నట్టున్నది. ఇదంతా నీకు చిత్రంగా కనుపించడంలేదు.'

ఆవిడేమీ మాటాడలేదు.

ఆయనే అన్నారు—

"పెద్దాడు పుట్టిన మరుక్షణం నుంచి ఈ క్షణం వరకు తీరుబడి లేనంత కార్యక్రమాల్లో మునిగిపోతున్నాను. పెళ్లయిన కొత్తలో రెండు సంవత్సరాలపాటు సరదాగా కాల క్షేపం చేశా వనుకుంటాను. ఆ తర్వాత బాధ్యతలు పెరిగాయి. ఆఫీసుపని, పిల్లల పెంపకం, తీరుబడిలేని యీ కార్యక్రమాల్తో విసిగిపోయాను పార్వతీ ! ..... "

'పార్వతీ' అనే పిలుపు మళ్లీ ఇన్నేళ్లకి చోటు చేసు కోవడంతో అటు జానకిరామయ్యగారు, ఇటు పార్వతీ— యిద్దరూ ఆశ్చర్యపోయారు. వెంటనే ఇద్దరూ ఏమీ మాటాడ లేక పోయారు.

"విధి నిర్వహణలో చాలా విషయాలు పట్టించుకుని పట్టించుకోనట్టు చూడవలసి వస్తుంది. నా ప్రవర్తన నిన్నెప్పు డైనా బాధపెడితే నన్ను క్షమిస్తావు గదూ పార్వతీ !"

"మీ రేదో కొత్తగా మాటాడుతున్నారు. నాకు బాధే మిటీ, మిమ్మల్ని క్షమించేపాటి దానినా నేను. ?"

ఆయన పేలవంగా నవ్వారు !

"పిల్లల్ని పెంచి పెద్దవాళ్లను చెయ్యడంలో ఉన్న ఆనందం బహు కొద్దిమందికే లభిస్తుంది. నేను అదృష్ట వంతురాలిని. నాకే దిగులూ లేదు. దేవుడిలాంటి మీరు, వరాల సాటి పిల్లలూ. స్త్రీకి ఇంతకంటె కావలసిం దేముంది చెప్పండి ?"

పార్వతి చేతిని ప్రేమతో నిమిరారు జానకిరామయ్య.

అదే సమయంలో—

వీధి తలుపు తీసిన చప్పు డయింది.

"ఏమిటది ?" ఆత్రంగా అడిగారు జానకిరామయ్య.

"శేషు సినిమాకి వెడుతున్నాడు కాబోలు."

"వ్వాట్." ఆయన క్కోపం వచ్చింది.

"పోనిద్దురూ .... పసివాడు. సాయంత్రం నుండీ నా ప్రాణం తీసి చివరికి నన్ను వప్పించ గలిగాడు. అదీగాక యివ్వాళ శుభవార్త తెచ్చాడాయె..... వాళ్ల స్నేహితు లందరూ కలిసి ఏదో యింగ్లీషు సినిమాకి వెడదామని అనుకున్నార్ట ...." ఆవిడ చెప్పవలసినదంతా చెప్పింది. అంతా విని కోపం పట్టలేక అన్నారు జానకిరామయ్య—

"ఇలా సెకండ్ షోలకి వెడితే ఆరోగ్యం పాడవదూ.... వాడినని లాభంలేదు. అంతా నువ్వు చేస్తున్నావ్. నీకు పిల్లల్ని పెంచడం చాతకాదు. ఇంకా ఎప్పుడు నేర్చు కుంటావో ఏమో. వుండు .... వాడినీ .... రే పుదయం గుర్తు చెయ్యి. వెధవాయి చర్మం వల్చేస్తాను .... సినిమాకి వెడతాడు. సినిమాకి .... "

చివరికి తేలిన విషయం :

చిరంజీవి శేషు పైన తను తీసుకోవాలిసిన క్రమ శిక్షణ చర్య రేపు ఉదయానికి వాయిదా వేయబడింది.

---